క్లుప్తంగా

జోరుగా హనుమాన్ భక్తుల మాలధారణ



గీసుకొండ : మండలంలో హనుమాన్ దీక్షల మాలధారణ జోరుగా సాగుతోంది. కోనాయమాకుల సమీపంలోని ప్రసిద్ధ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో అక్షయ తృతీయ సందర్భంగా హనుమాన్ దీక్షలు స్వీకరించడానికి భక్తులు శుక్రవారం భారీ సంఖ్యలో తరలివచ్చారు. పలువురు భక్తులు 21 రోజులపాటు దీక్షగా ఉండటానికి అర్ధమండల దీక్షలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు జాగర్లపుడి అయ్యప్ప శర్మ భక్తులతో మాలధారణ చేయించగా ధర్మకర్తలు సీతా ఆనంద్‌సా, కుమార్‌సా ఏర్పాట్లు చేశారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ



ఖానాపురం : మండలంలో ఓటరు స్లిప్పుల పంపిణీ జోరుగా సాగుతోంది. బీఎల్‌ఓలు ఓటర్లకు స్లిప్పులు అందజేస్తున్నారు. ప్రజలు ఉదయాన్నే ఉపాధి హామీ పథకం పనులకు వెళ్తుండగా బీఎల్‌ఓలు పని ప్రదేశాల వద్దకు వెళ్లి ఓటరు స్లిప్పులు అందజేస్తున్నారు.

గుండెపోటుతో స్పెషల్ ఆఫీసర్ మృతి



ప్రదీప్‌కుమార్ (ఫైల్)

చెన్నారావుపేట: మిషన్ భగీరథ గ్రిడ్ డీఈ, పాపయ్యపేట, బోజెర్వు, అమృతండా స్పెషల్ ఆఫీసర్ ప్రదీప్ కుమార్ (54) గుండెపోటుతో మృతి చెందారు. హనుమకొండలో నివాసముంటున్న ఆయనకు గురువారం గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదేరోజు సాయంత్రం మృతి చెందారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. ప్రదీప్‌కుమార్ మృతికి మిషన్ భగీరథ నర్సంపేట ఇంట్రా ఇన్‌చార్జ్ డీఈ, చెన్నారావుపేట ఏఈ మంగీలాల్, ఎంపీడీఓ గోవిందరావు, మండల పరిషత్ సూపరింటెండెంట్ దయాకర్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు సంతాపం తెలిపారు.

నివాళి




చెన్నారావుపేట: మిత్రుడికి విద్యావేత్త, ప్రొఫెసర్ కంచ ఐలయ్య శుక్రవారం నివాళులర్పించారు. పాపయ్యపేటలో మొక్కజొన్న చొప్పకు నిప్పు పెట్టడంతో ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని రైతు అల్లంనేని పాపారావు గురువారం మృతి చెందిన విషయం తెలిసిందే. అదే గ్రామానికి చెందిన కంచ ఐలయ్య శుక్రవారం పాపయ్యపేటకు చేరుకుని పాపారావుతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. పాపారావు తనకు మంచి స్నేహితుడని, చిన్నప్పుడు కలిసి చదువుకున్నామని, అలాంటి వ్యక్తిని కోల్పోవడం చాలా బాధాకరమన్నారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

గీసుకొండ: మండలంలోని గొర్రెకుంట కట్టమల్లన్న చెరువులో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు చెరువు నీటిపై మృతదేహం తేలి కనిపించిందని ఆయన పేర్కొన్నారు. పసుపురంగు చీర, ఎరుపు, ఆకుపచ్చ రంగు చుక్కల జాకెట్ ధరించి, ఎరుపు రంగు గాజులు వేసుకుని ఉందన్నారు. ఆచూకీ తెలిసిన వారు తమకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

పరామర్శ



రాయపర్తి : మండలంలోని కాట్రపల్లికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త మండల శ్రీధర్ రోడ్డు ప్రమాదంలో గాయపడగా ఆయన్ను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శుక్రవారం పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త గంగారపు శ్రీనివాస్ మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే తిర్మలాయపల్లిలో దొంతర బోయిన అంజయ్యను అతడి తల్లి నర్సమ్మ మృతి చెందగా పరామర్శించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ గుకుమార్‌గౌడ్, జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి, సురేందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఇండియా కూటమి గెలుపు ఖాయం

● నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

దుగ్గొండి : పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి గెలుపు ఖాయమని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని మల్లంపల్లి, బొబ్బరోనిపల్లి, గొల్లపల్లి, గోపాలపురం, పొనకల్, రేకంపల్లి, మందపల్లి, మహ్మదాపురం గ్రామాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో శుక్రవారం చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. శ్రేణులకు తప్పకుండా సముచిత ప్రాతినిధ్యం కల్పిస్తామన్నారు. మహబూబాబాద్ ఎంపీగా పోరిక బలరాంనాయక్‌ను గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రల్ల బాబు, నాయకులు చెన్నూరి కిరణ్‌రెడ్డి, ఒలిగె నర్సింగరావు, చుక్క రమేశ్ పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండలంలోని పాపయ్యపేటకు చెందిన సొసైటీ డైరెక్టర్, బీఆర్‌ఎస్ నాయకుడు మజ్జిగ రాంబాబు, లింగగిరి మాజీ సర్పంచ్ మాదారపు భాస్కర్, తదితర బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరగా వారికి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. మహబూబాబాద్ ఎంపీగా పోరిక బలరాంనాయక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్, జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



దుగ్గొండి : పార్టీలో చేరిన వారితో మాధవరెడ్డి

కాంగ్రెస్ పాలనలోనే బడుగులకు న్యాయం

వర్ధన్నపేట : కాంగ్రెస్ పాలనలోనే బడుగులకు న్యాయం జరుగుతుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు స్పష్టం చేశారు. మండలంలోని కట్ర్యాల గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ బుర్ర సురేందర్ గౌడ్, గోరుకంటి అయ్యాలు, తుమ్మల ప్రశాంత్, కొండేటి రాజబాబు, ఎలికట్టె సాంబయ్య, ఎలికట్టె అజయ్, తదితర బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం కాంగ్రెస్‌లో చేరగా వారికి ఎమ్మెల్యే నాగరాజు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ నాయకత్వంలో పార్టీ అధికారంలోకి వస్తేనే దేశం మరింత పటిష్టమవుతుందని తెలిపారు. కేంద్రంలో అధికారంలో ఉండి పదేళ్లపాటు పాలన సాగించిన బీజేపీతో పేదలకు భారీగా నష్టపోయారని చెప్పారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లీగల్ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్‌రావు, నాయకులు రాయపురం సాంబయ్య, నరుకుడు వెంకటయ్య, కొండేటి మధుకర్, పుల్ల సుధాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



వర్ధన్నపేట : మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు



గీసుకొండ : పార్టీలో చేరిన వారితో ప్రకాశ్‌రెడ్డి

గీసుకొండ : మండలంలోని గీసుకొండకు చెందిన పలువురు బీఆర్‌ఎస్, బీజేపీ క్రియాశీల కార్యకర్తలు కర్ణకంటి రఘు, బి.రాజు, బి.శ్రీకాంత్, కె.భార్గవ్, కిషన్, రాజ్, సురేశ్, నవీన్, వినీత్, పవన్ కల్యాణ్, తదితరులు పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి చాడ కొమురారెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి హనుమకొండలోని తన నివాసంలో ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు దౌడు ప్రవీణ్, దౌడు భరత్, జావిద్, తాటికొండ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కూలీలుగా మార్చిన పాపం కాంగ్రెస్‌దే

● మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట రూరల్ : రైతులను ఉపాధి హామీ కూలీలుగా మార్చిన పాపం కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని స్థానిక మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మహేశ్వరంలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలను కలిసి ఓట్లు అభ్యర్థించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రైతులు, కూలీలను ఆదుకుంటామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. బీఆర్‌ఎస్ తరఫున మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచినమాలోత్ కవితను అత్యధిక మెజార్టీతో గెలపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ, ఎంపీపీ మోతె కళావతి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ యంత్ర పరికరాలు పడేయగలరా?

ఖానాపురం : దొంగ జీఓలు తీసుకొచ్చారని దుష్ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు సబ్సిడీ యంత్ర పరికరాలను బస్టాండ్ సెంటర్లలో పడేయగలరా? అని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రశ్నించారు. మండల కేంద్రంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు వెంకటనర్సయ్య, బోడ పూలునాయక్, కాశీ తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట రూరల్: మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

ఎంపీగా కవిత గెలుపునకు కృషి చేయాలి



నర్సంపేట : ప్రచారం చేస్తున్న నాయకులు



దుగ్గొండిలో..

నర్సంపేట : బీఆర్‌ఎస్ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాలోతు కవిత గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. పట్టణంలోని 10వ వార్డులో కౌన్సిలర్ నాగిశెట్టి పద్మప్రసాద్, 11వ వార్డులో కౌన్సిలర్ గంప సునీత రఘునాథ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దుగ్గొండి : కాంగ్రెస్ మోసపూరిత మాటలకు గురికాకుండా తెలంగాణ తెచ్చిన పార్టీని గెలిపించుకోవాలని జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్ కోరారు. ఎంపీగా మాలోతు కవితను గెలిపించాలని కోరుతూ పట్టణంలో శనివారం నిర్వహించిన ప్రచారంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసగించిందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి ఓటుతో బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు కూస రాజు, గుండెకారి రవీందర్, కామిశెట్టి ప్రశాంత్, మదు, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : బీఆర్‌ఎస్ అభ్యర్థి మాలోతు కవిత గెలుపు కోరుతూ మండలంలో ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకటనర్సయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ నిర్లక్ష్యాన్ని ప్రజలకు వివరించారు. కార్యక్రమాల్లో నాయకులు సదర్‌లాల్, బాలునాయక్, పసునూరి వెంకన్న పాల్గొన్నారు.

చెన్నారావుపేట : ఎంపీగా మాలోతు కవితను గెలిపించాలని కోరుతూ మండలంలోని అమీనాబాద్, ఎల్లయ్యగూడెం, చెన్నారావుపేట, బోజెర్వు గ్రామాల్లో జెడ్పీటీసీ బానోతు పత్తినాయక్, మాజీ జెడ్పీటీసీ బుర్రి తిరుపతి, మాజీ మండల అధ్యక్షుడు బాల్నె వెంకన్న, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహమ్మద్ రఫీ, అమీనాబాద్ సొసైటీ చైర్మన్ మురహరి రవి ప్రచారం చేశారు. కార్యక్రమాల్లో అమీనాబాద్ ఎంపీటీసీ కదారి సునీత సాయిలు, అమ్మ రాజేశ్, ముసుకు ఐలయ్య, పల్లగొండ తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.



ఖానాపురం : ప్రచారం చేస్తున్న నాయకులు



చెన్నారావుపేటలో..

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

● పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

రాయపర్తి : కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి తెలిపారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు అవలంబించిన తప్పుడు విధానాలను ప్రజల్లో ఎండగట్టాలని శ్రేణులకు ఆమె సూచించారు. వరంగల్ ఎంపీగా కడియం కావ్యను గెలిపించాలని కోరుతూ మండలంలోని కొత్తూరు, సూర్యతండా, సన్నూరు తదితర గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. పదేళ్ల పాలనలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని 7 లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టిందని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ రాజ్యాంగాన్ని రద్దు చేసే కుట్రలకు పాల్పడుతోందని చెప్పారు. బీఆర్‌ఎస్, బీజేపీలకు గుణపాఠం చెప్పాలని ప్రజలను కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని సూచించారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి తీరుతామని భరోసా ఇచ్చారు. కావ్య గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఆకాంక్షించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పలువురి చేరిక

మండలంలోని కొలన్‌పల్లి, పెర్కవేడు, బందనపల్లి, సన్నూరు గ్రామాలకు చెందిన నాగండ్ల భాస్కర్, రామిండ్ల యాకయ్య, మాచర్ల కుమార్, వంగాల దయాకర్, సీతారాంనాయక్, తదితరులు తిరుమల కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమాల్లో తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హమ్యానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, పాలకుర్తి ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణమాచార్యులు, నాయకులు గోపాల్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కొండా' వర్గీయుల ప్రచార ర్యాలీ



గీసుకొండ : గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారంలో శుక్రవారం రాత్రి కొండా దంపతుల ముఖ్య అనుచరుడు, కాంగ్రెస్ జిల్లా నాయకుడు గోపాల నవీన్‌రాజ్ ఆధ్వర్యంలో కడియం కావ్యను ఎంపీగా గెలిపించాలంటూ ప్రచార ర్యాలీని నిర్వహించారు. డప్పుచప్పుళ్లు, బాణసంచా మధ్య అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలివచ్చారు. ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు మాడిశెట్టి రాజయ్య, కొమ్ముల కిశోర్, కొట్టె కుమార్, మాడిశెట్టి రవి, స్వామి, గాదె మాణిక్యం పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ప్రచార ర్యాలీలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి వర్గం వారు పాల్గొనకుండా ఉండటం గమనార్హం. కాగా ధర్మారంలో బీఆర్‌ఎస్ ప్రచార వాహనంలోని ఫ్లెక్సీలను కొండా వర్గం చింపివేసింది. దీంతో ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది.

కాంగ్రెస్ నాయకుల ఇంటింటి ప్రచారం



నర్సంపేట : ప్రచారం చేస్తున్న నాయకులు

నర్సంపేట : మహబూబాబాద్ ఎంపీగా పోరిక బలరాంనాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్టణంలోని 1, 13, 14, 16, 10, 18వ వార్డుల్లో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ హయాంలోనే సుపరిపాలన అందుతుందని చెప్పారు. బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థులకు ఓటేస్తే వృథా అవుతుందని చెప్పారు. కార్యక్రమాల్లో కౌన్సిలర్లు, పార్టీ ఇన్‌చార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యర్ర జగన్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు, ఎంపీటీసీ బిక్కి లింగమ్మ మురళి ఆధ్వర్యంలో మండలవ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బలరాంనాయక్ గెలిస్తేనే అభివృద్ధి సాధ్యమని ఓటర్లకు వివరిస్తున్నారు. కార్యక్రమాల్లో నాయకులు లింగయ్య, లాల్‌సాహెబ్, ఎల్లగౌడ్ పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండలంలోని ఎల్లాయగూడెం, మాధవనగర్ కాలనీ, 16 చింతల్ తండా, బోజెర్వు, పాత ముగ్దుంపురం గ్రామాల్లో మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మంచాల సదయ్య, ఎంపీటీసీ భూక్య రమాబాయి మైబూ సింగ్ రాథోడ్ ప్రచారం చేశారు. బలరాంనాయక్ గెలుపు కోసం ప్రతీఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమాల్లో ఆ పార్టీ నియోజకవర్గ ఉపాధ్యక్షులు రూసిక శ్రావణ్ కుమార్, పోలెపల్లి భిక్షపతి, ననుమాస కరుణాకర్, వీరస్వామి, శంకేసి రంజిత్, అలువాల శ్రీనివాస్, అంబాల రవి, జక్క వెంకన్న, గ్రామ కమిటీల అధ్యక్షులు బాదావత్ బాలునాయక్, రమేశ్‌నాయక్, మాజీ ఉపసర్పంచ్ సతీశ్ పాల్గొన్నారు.



ఖానాపురం : బుధరావుపేటలో..



చెన్నారావుపేట : ప్రచారం చేస్తున్న నాయకులు

బీఎస్పీకి ఓటేయండి



నల్లబెల్లి : బహుజనవాదాన్ని బలపర్చుతూ బీఎస్పీ అభ్యర్థిగా మహబూబాబాద్ ఎంపీ స్థానానికి పోటీ చేస్తున్న కోనేటి సుజాతను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గుండాల మదన్‌కుమార్ కోరారు. మండలంలోని నల్లబెల్లి, నందిగామ, లెంకాలపల్లి తదితర గ్రామాల్లో సుజాతతో కలిసి శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మదన్‌కుమార్ మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ రాజ్యాంగాన్ని మార్చే కుట్రలకు పాల్పడుతోందని చెప్పారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఎన్నికల హామీలు విస్మరించి మోసపూరితంగా వ్యవహరించాయని తెలిపారు. బీఎస్పీ ద్వారానే ప్రజలకు సుపరిపాలన అందుతుందని స్పష్టం చేశారు. సుజాతకు ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు బుర్రి సాగర్, నాయకులు శ్రీకాంత్, ప్రసంగి, గుగులోత్ రాజన్న, విజయ్, నగేశ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

మాలోతు కవితను ఆడబిడ్డగా ఆదరించాలి

చెన్నారావుపేట : బీఆర్‌ఎస్ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాలోతు కవితను ఆడబిడ్డగా గిరిజనులు ఆదరించి గెలిపించాలని శంకరంతండాకు చెందిన ఆ పార్టీ మండల నాయకుడు భూక్య శ్రీనివాస్ కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించి కవిత గెలుపునకు బాటలు వేయాలని కోరారు. ఈనెల 13న జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో గిరిజనులందరూ కారు గుర్తుకే ఓటేయాలని సూచించారు.

మనోధైర్యం నింపడానికే కవాతు



ఇల్లందలో కవాతు చేస్తున్న సీఐ, ఎస్సై, పోలీసులు

వర్ధన్నపేట : ఈనెల 13న జరుగనున్న పార్లమెంట్ ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రజల్లో మనోధైర్యం నింపడానికే బీఎస్ఎఫ్ జవాన్లు, పోలీసులు కవాతు నిర్వహిస్తున్నట్టు స్థానిక సీఐ సూర్యప్రకాశ్ తెలిపారు. మండలంలోని ఇల్లంద, నల్లబెల్లి గ్రామాల్లో బీఎస్ఎఫ్ జవాన్లు, స్థానిక పోలీసులతో కలిసి శుక్రవారం నిర్వహించిన పోలీసు కవాతు సందర్భంగా ఎస్సై ప్రవీణ్‌కుమార్‌తో కలిసి సీఐ సూర్యప్రకాశ్ మాట్లాడారు. ప్రశాంతంగా నిర్వహించడమే ధ్యేయంగా పోలీసు కవాతు నిర్వహించినట్టు తెలిపారు. ప్రజలు నిర్భయంగా పోలింగ్ బూత్‌ల వద్దకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు కానిస్టేబుళ్లు బుచ్చిరాజు, సురేశ్, అశోక్, దామోదర్, తదితరులు పాల్గొన్నారు.

'మతోన్మాద బీజేపీని ఓడించండి'



జీపుజాతాలో మాట్లాడుతున్న బాబు

దుగ్గొండి : పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని చిత్తుగా ఓడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఈసంపల్లి బాబు కోరారు. సీపీఎం బలపర్చిన ఇండియా కూటమి మహబూబాబాద్ అభ్యర్థి బలరాంనాయక్ గెలుపును కోరుతూ మండలంలో శుక్రవారం నిర్వహించిన జీపుజాతాలో బాబు మాట్లాడారు. గడచిన పదేళ్లలో బీజేపీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి నిత్యావసర సరుకుల ధరలను విపరీతంగా పెంచి పేదలపై భారాలు మోపిందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టిందని మండిపడ్డారు. సుదీర్ఘ పోరాటాల ఫలితంగా సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు పుచ్చకాయల నర్సింహారెడ్డి, అక్కపెల్లి సుధాకర్, చల్ల నర్సింహారెడ్డి, గిన్నె సాంబయ్య, కోడం రమేశ్, కొంగర నర్సింహస్వామి, ఇజ్జిగిరి కనకమల్లు తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో సమన్వయం కీలకం

చెన్నారావుపేట : ఎన్నికల విధి నిర్వహణలో వెహికిల్ ఇన్‌చార్జ్ పర్సన్లు, వీల్‌చైర్ ఇన్‌చార్జ్ పర్సన్లు సమన్వయంతో వ్యవహరించడం కీలకమని ఎంపీడీఓ గోవిందరాజు, ఐసీడీఎస్ సీడీపీఓ విద్య తెలిపారు. వెహికల్ ఇన్‌చార్జ్ పర్సన్లకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఆశాజ్యోతి మండల సమైక్య కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎంపీడీఓ గోవిందరాజు, సీడీపీఓ విద్య మాట్లాడారు. వయోవృద్ధులను, వికలాంగులను పికపింగ్, డ్రాపింగ్‌లో వినియోగించే ఆటోలకు స్టిక్కర్లు, బ్యానర్లు, ఆడియో సిస్టం లేకుండా చూసుకోవాలని చెప్పారు. వారిని ఓటింగుకు తీసుకుపోయే సమయాన్ని ముందుగానే తెలియజేయాలని తెలిపారు. తద్వారా ఓటింగ్ శాతం పెరిగేలా కృషి చేయాలన్నారు. ఏపీఎం ఈశ్వర్ మాట్లాడుతూ వెహికల్ ఇన్‌చార్జ్ పర్సన్లు, వెహికల్ డ్రైవర్లు బాధ్యతగా విధులు నిర్వర్తిస్తూ గంటకోసారి రిపోర్ట్ చేయాలని స్పష్టం చేశారు. అనంతరం ఉచిత రవాణా సౌకర్యంపై ప్రచారం చేసేలా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

కలెక్టరేట్ ఎదుట యువతి ఆత్మహత్యాయత్నం

నర్సంపేట రూరల్ : వరంగల్ కలెక్టరేట్ ఎదుట యువతి ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. బాధితురాలు శివరంజని కథనం ప్రకారం.. ఖానాపురం మండలం బుధరావుపేటకు చెందిన శివరంజనికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. గొడవల కారణంగా భర్తకు దూరంగా ఉంటోంది. ఈ క్రమంలో నర్సంపేటకు చెందిన భిక్షపతితో పరిచయం ఏర్పడి సహజీవనం సాగించారు. శివరంజని గర్భం దాల్చడంతో భిక్షపతి నర్సంపేట పట్టణంలోని కరుణశ్రీ ఆస్పత్రిని సంప్రదించాడు. వైద్యులు అబర్షన్ అయ్యేందుకు ఇచ్చిన మాత్రను శివరంజని వేసుకోగా తీవ్ర రక్తస్రావమైంది. వెంటనే ఆమెను వరంగల్‌లోని పలు ఆస్పత్రులకు తీసుకెళ్లగా వైద్యానికి నిరాకరించారు. అనంతరం నర్సంపేటలోని కరుణశ్రీ ఆస్పత్రిలో జనవరిలోనే అబార్షన్ చేశారు. దీంతోపాటు గర్భసంచిని సైతం తొలగించారు. అప్పటి నుంచి శివరంజనికి అనారోగ్య సమస్యలు తలెత్తాయి. ఈ క్రమంలో భిక్షపతి తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఇంటివద్ద వదిలేసి వెళ్లిపోయాడు. వేరే వైద్యుల వద్దకు వెళ్లి పరీక్ష చేయించుకోగా అబార్షన్ చేయడంతోపాటు గర్భసంచి సైతం తొలగించారని చెప్పగా ఈనెల 7న ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టింది. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రకాశ్ ఆస్పత్రిని సందర్శించి నోటీస్ సైతం అందించారు. తనకు న్యాయం చేయాలని కోరుతూ శివరంజని కలెక్టర్ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన తెలుపుతూనే నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. కార్యాలయ సిబ్బంది తక్షణమే ఆమెను చికిత్స కోసం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

చందా లింగయ్యకు మద్దతు

నర్సంపేట : మహబూబాబాద్ ఎంపీ స్థానానికి పోటీ చేస్తున్న ఆదివాసీ గిరిజన సంఘాల ఉమ్మడి అభ్యర్థి చందా లింగయ్యకు ఎంసీపీఐ(యూ), బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) మద్దతు ఇస్తున్నట్లు ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి తెలిపారు. పట్టణంలోని ఓంకార్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత విభజన హామీలను విస్మరించిందని విమర్శించారు. గిరిజన యూనివర్సిటీని ప్రకటించినా నిధులు వెచ్చించకుండా వివక్ష పాటిస్తోందని చెప్పారు. కత్తెర గుర్తు మీద ఓటు వేసి లింగయ్యను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గోనె కుమారస్వామి, రాష్ట్ర కమిటీ సభ్యులు నాగెల్లి కొమురయ్య, కుసుంబ బాబురావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కన్నం వెంకన్న, డివిజన్ కార్యదర్శి మహ్మద్ రాజాసాహెబ్, సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి, జిల్లా కమిటీ సభ్యులు కేశెట్టి సదానందం, జన్ను రమేశ్, డివిజన్ కమిటీ సభ్యులు మార్త నాగరాజు పాల్గొన్నారు.

ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం తప్పదు

వర్ధన్నపేట : పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలోని బీజేపీకి గుణపాఠం తప్పదని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ వరంగల్ ఉమ్మడి జిల్లా కమిటీ సభ్యుడు రాచర్ల బాలరాజు అన్నారు. పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ గడచిన పదేళ్లలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని చెప్పారు. హింస, దమనకాండతో పాలన సాగించారని తెలిపారు. పలు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేయడమే కాక నౌక, వైమానిక జాతీయ రహదారులు, తదితర సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టిందని వివరించారు. గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే పేరుతో రైతుల భూములను లాక్కుందన్నారు. మళ్లీ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం స్థానంలో మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.